



# భలే కొడుకు

కొడుకుల సూర్య సుబ్రహ్మణ్యం

"అబ్బాయలా రుసరుసలాడుతూ వెళ్ళిపోయాడేంటండీ? ఇంతసేపూ మీరేదో మాట్లాడుకుంటున్నారనుకున్నాను. తీరా మీ వాలకం చూస్తే ఏదో ఘర్షణపడినట్లుగా వుందే! అసలింతకీ ఏమయిందండీ?'' సాగదీసింది సీతారత్నం.

"ఎప్పుడూ సరదాగా నవ్వుతూ నవ్విస్తూ చురుగ్గా వుండేవాడిలో ఎందుకో ఓ వారం పదిరోజుల్నుండీ చిరాకూ కోపం బాగా ఎక్కువైపోయాయి. మనం ఏమనకుండానే వాడు మనమీద విరుచుకు పడిపోతున్నాడు. మంచిరోజు చూస్కుని కోడల్నిక్కడ దించిపోతారు వియ్యాలవారు. మన అదుపాజ్ఞల్లో వుంటూ లక్షణంగా మెలగాల్సిన కోడలుపిల్ల ముందుకూడా వాడిలాగే ప్రవర్తిస్తే మన మర్యాదేమైనా వుంటుందా అసలు? మనం వాడిమీద ఎన్నో ఆశలు పెట్టుకున్నాం. అవన్నీ అడియాశలేనా?'' బాధగా నిట్టూర్చాడు దశరథరామయ్య.

"చాల్లెండి మీరూ మీ చాదస్తం! అడ్డాల్లో బిడ్డడుగానీ, గడ్డాలొచ్చాక్కాదూ! అన్నీ తెలిసుండి మీరే ఇలా డీలాపడిపోతే ఎలాగండీ?'' కాస్త

ఊరడింపుగా అంది భార్యామణి.

"పుత్రశోకంతో మరణించిన దశరథుడంతటి గొప్పవాణ్ణి నేను కాకపోయినా ఎందుకోగానీ మనవాడు వేరింటికాపురం అంటే తట్టుకోలేకపోతున్నా సీతా" అన్నాడు దుఃఖభారంతో దశరథరామయ్య.

"అయ్యోరామా! ఇవేం పాడుబుద్ధులండీ వాడికి! నేనింకా ఏదో చిన్న విషయం అనుకున్నా. వాడికిదేం రోగం? మనిద్దరం వాడికి భారమైపోతామనా ఏంటి? వాడిపెళ్ళాం కష్టపడిపోతుందనా? మొదటిరాత్రి ఏం నూరిపోసిందో ఆ మహాతల్లి!" ఆవేశం ఆపుకోలేకపోయిందా ఇల్లాలు.

"ఛ...ఛ... అవేం మాటలే సీతా? ఈనాడయితే వియ్యంకుడయ్యాడుగానీ, పరంధామయ్య నాకు చిన్నప్పట్నుండే బాగా పరిచయం. వాడి విషయం, వాడి కుటుంబ విషయాలు నాకు తెలియనివంటూ ఏమీలేవు. కోడలు సుగుణ పేరుకు తగ్గట్టే సుగుణాల పుట్ట. ఇంక పనిపాట్ల విషయంలో అంటావా? దానికదే సాటి. ఒక్క క్షణం వూరికే కూర్చోదు. మన మంజునాథ్‌లో వచ్చిన మార్పుకీ, సుగుణకీ ఎలాంటి సంబంధం లేదు. ఈ విషయం నేను ఘంటాపథంగా చెప్పగలను." అంటూ భార్య ఆవేశాన్ని చల్లార్చాడా పెద్దాయన.

* * *

రాత్రి పదయ్యింది. కాలింగ్‌బెల్ చప్పుడు విని పడక్కుర్చీలో కునుకుపాట్లు పడుతున్న దశరథరామయ్య చటుక్కున లేచివెళ్ళి గడియతీశాడు. కనీసం తండ్రిని చూపుల్తోనైనా పల్కరించకుండానే విసురుగా తన రూంలోకి వెళ్ళిపోయాడు.

"సాయంత్రం ఐదు గంటలకు ఆఫీసయిపోతే ఇంత రాత్రిదాకా ఏంచేశావురా?" అని మునుపటిలా చనువుగా అడిగే ధైర్యం వాళ్ళకి పూర్తిగా లేకుండా పోయింది.

"ఇంతకీ వెర్రినాయన ఎక్కడెక్కడ తిరిగొచ్చాడో ఏంటో? నాకు చెప్పనిదే ఎటూ వెళ్ళడు. అసలు తిన్నాడో లేదో? పస్తుంటే మాత్రం ఆ పాపం నన్నూరికే పోనీయదు. ఎప్పుడైనా అమ్మా! ఆకలేస్తోంది అన్నం పెట్టమని నా బుజ్జినాయన అడిగి మరీ పెట్టించుకొని తినడం పాతికేళ్ళనుండి చూస్తున్నాను. బాగా చదువుకున్నాడు. ఉద్యోగం వచ్చింది. పెళ్ళికూడా అయ్యింది. అంతే తప్ప బొత్తిగా లోకజ్ఞానం ఎరుగడు". సీతారత్నం ఆత్మఘోషను పూర్తిగా అర్థం చేసుకున్నాడు దశరథరామయ్య. టపటపా నాలుగు కన్నీటిబొట్లు వదుల్తూ.

## నాలో హంపీ

కవితలల్లిన రాజు
కలము వేసిన చిందు
నరుని నాలుక మీద
నట్టు ద్రొక్కినవేళ
ఎద మొదలులో తాకు
పద గతులలో కైత
అర్ధమేని అమరికల
అందె సవ్వడులెచట...?

మేలి ముసుగుల రాణి
మువ్వన్నె పారాణి
పగటి రేడును జూచి
పక్కుపక్కున నవ్వ
భరత పదగతులలో
చలితమై మొలకట్టు
జారి దొర్లిన నాటి
జాతి ముత్తెములెచట...?

కిన్నెరాంగన పలుకు
వెన్నెలంచున తళుకు
విన్నంత కన్నంత
వేయి పులకలు పూచు
ఎద పొదల సరిగమల
సత్య శివ సుందరము
వాకొన్న వాయువుల
కంఠనాళములెచట...?

- సాంధ్యశ్రీ

"నీ బాధంతా మన మంజునాథ్ గురించేగా! వాడిలా ప్రవర్తిస్తున్నాడంటే ఏదో బలమైన కారణమే అయుంటుంది. దేనికైన్నా కాలమే సమాధానం చెబుతుంది" అంటూ ఓదార్చాడు భర్త.

"పోనీలెండి.. మీరుకూడా పొద్దున్నుంచి ఏమీ తిన్లేదు. కాస్త ఎంగిలిపడండి" భార్య మాట పూర్తి కాకుండానే.

"చూడు సీతా! నాకెందుకో ఆకలిగాలేదు. దయచేసి నన్నిబ్బంది పెట్టక్కు. అంతా పస్తులుంటే ఇంటికి అరిష్టం. నా మాటవిని నువ్వయినా భోంచేసి పడుకో..." అనునయించాడేగానీ ఆమె తినదని అతనికి బాగా తెలుసు.

* * *

"చూడమ్మా! ఇప్పటికే బాగా రాత్రయ్యింది. మళ్ళా ఉదయాన్నే లేచి, పనిపాటల్లో మునిగిపోతావ్. వెళ్ళమ్మా.. వెళ్ళిపడుకో. ఆ మరిచా! మీ ఆయనకి హార్లిక్స్ కలిపిచ్చావా?" అత్తగారి మాట పూర్తికాకుండానే..

"అయ్యో నా మతిమండా! మరిచేపోయానే" అంటూ వంటింట్లోకి పరుగెత్తుకెళ్ళి ఐదు నిముషాల్లో హార్లిక్స్ రెడీ చేసేసి, బెడ్‌రూమ్‌లోకి వెళ్ళిపోయింది కోడలు సుగుణ.

* * *

"చూడండి నాన్నా! ఈ విషయంలో మీరూ అమ్మా ఎంతగా బాధపడినా సరే! నేను మాత్రం నా భార్యను తీసుకొని వేరింటి కాపురం పెడదామని రూఢీ చేసేస్కున్నాను. ఈ విషయంలో నా భార్య ప్రమేయమేమీ లేదు. ఇది కేవలం నా నిర్ణయం మాత్రమే. ఆర్థిక స్తోమతతోపాటు ఆరోగ్యాన్నికూడా ఆ భగవంతుడు మీ ఇద్దరికీ ఇచ్చాడు. ఇంక మీ పాట్లేవో మీరు పడండి. ఏ కాలో చెయ్యో వంగాకంటారా? అప్పుడాలోచిద్దాంలెండి! ఓ వారం పదిరోజుల్లో మేం వెళ్ళిపోతున్నాం" కరాఖండిగా చెప్పేశాడు మంజునాథ్.

పాపం భార్య సుగుణకేం అర్థం కాలేదు సరికదా... కుమిలి కుమిలి ఏడ్చేస్తూ "చూడండి.. అనేదో చెప్పబోయేంతలో.. భర్త చూపుల్తోనే ఆమె నోరు మూతబడిపోయింది. ఓ వారం రోజుల తర్వాత--

"మీరేం నొచ్చుకోకుండా వుంటానంటే నేనోమాట అడగొచ్చా?" భయంభయంగా అంది సుగుణ.

"పిచ్చిదానా! నువ్వడిగేదేంటో నాకు తెలీదనుకున్నావా? హాయిగా అందరం కలిసి మెలిసి వుంటే, అందులో సుఖం వుంటుందనీ, ఉన్నవూళ్ళోనే వేరింటి కాపురం పెడితే నల్గురూ నాల్గు మాటలనుకుంటారనీ, ఆ మాటలుంచి పెద్దవాళ్ళు మానసికంగా కుమిలిపోతారనీ, ఆ ప్రయత్నం విరమించుకుంటే బావుంటుందని కదా నీ అభిమతం?" అతనలా అడిగేసరికి ఆశ్చర్యచకితురాలయిపోయింది భార్యామణి.

"మరన్నీ తెలిసికూడా మీరూ.."

"ఇందులో అంతగా ఆశ్చర్యపోవడానికేముందిలే" అనేశాడేగానీ అంతకుమించి ఒక్కమాటకూడా మాట్లాడలేదా సందర్భంలో మంజునాథ్.

* * *



ఓ రోజు రాత్రి సరిగ్గా ఎనిమిది గంటల సమయంలో ఎవ్వరూ వూహించని విధంగా మంజునాథ్ తండ్రి పాదాలను తాకడంతో జలజలా కన్నీటిబొట్లు విడిచేశాడాయన. జీరబోయిన కంఠంతో "ఏమిట్రా ఇది..!?" అన్నాడేగాని ఆమాట కొడుకు చెవినపడలేదు. అలాగే తల్లి పాదాలక్కూడా నమస్కరించాడు. తల్లి కన్నీరుమున్నీరుగా విలపిస్తుంటే తనకేం పట్టనట్లు బ్రీఫ్ కేస్ తీస్కుని భార్యతోసహా వెళ్లిపోయాడు. తనెక్కడుంటున్నదీ అడ్రస్ కూడా పెద్దవాళ్లకు చెప్పలేదు. నోరు విడిచి పరంధామయ్య వివరాలడిగినా కూడా ఎందుకులెండి అనేశాడు అయిష్టంగా. ఓ పదిరోజులు మనోవేదనకు గురయ్యారు మంజునాథ్ అమ్మానాన్నలు.

✻ ✻ ✻

ఓ రోజు రాత్రి ఎనిమిది గంటల సమయంలో పదేళ్ళ కుర్రాడొకడు వచ్చి కవరొకటి దశరథరామయ్య చేతిలో పెట్టేసి తుర్రుమన్నాడు.

"పూజ్యులైన నాన్నగారికి... సంబోధనలో వున్న పూజ్యభావం పెళ్ళయ్యాక ఎటుపోయిందనేగా మీ సందేహం? మీపట్ల నాకున్న పూజ్యభావం తెంచేసుకుంటే తెగిపోయేంత బలహీనమైనదేం కాదులెండి. అసలు విషయం చెబుతావినండి. పండుటాకుల్లాంటి తాతయ్యా, నాయనమ్మల దుస్థితికి నా మనసెంతగానో చలించిపోయింది.

మీ పెళ్లయిన నాల్గురోజులకే మీరు వేరింటి కాపురం పెట్టేసి, తల్లిదండ్రులు నాకేం కారన్నట్లు విడిచిపెట్టేశారుట. వృద్ధాశ్రమంలో చేరుదామన్నా నా అన్నవాళ్ళెవరూ లేరని అబద్ధం ఆడలేక, ఉన్నా ఆదరించలేదన్న నిజం చెప్పలేక వాళ్ళా పని చెయ్యలేదు. పాపం ఆ ముసలిపాళ్ళిద్దరూ నిస్సహాయులై నిరాదరణతో శారీరకంగా మానసికంగా కృంగి కృశించి నశించిపోతూ ఈ ఊళ్ళోనే జీవచ్ఛవాల్లా బ్రతుకులీడుస్తున్నారంటే ఆ పాపం మనపాలిట శాపంకాదా? వాళ్ళు పడే బాధ ఎలావుంటుందో మీక్కూడా తెలియాలిగా!"

"అమ్మా! నేనే.. నీ ఒక్కగానొక్క గారాల కొడుకుని. ఎప్పుడూ నా బంగారం.. నా బంగారం అంటూ తెగమురిసిపోయేదానివి చూడు.. ఆ బంగారాన్నే! ఇప్పుడది కాస్తా చేజారిపోయిందని బాధపడుతున్నావు కదూ! అవున్లే.. కడుపు తీపి అలాంటిది మరి. ఒక్కసారి ఆలోచించు.

మా నానమ్మా తాతయ్యల అధ్వాన్నపు స్థితికి నువ్వు కాదూ కారణం? కన్నవాళ్ళనే కాదు అత్తమామల్ని కూడా కంటికిరెప్పలా చూస్కోవాలని నీకు తెలీకనా? పైగా 'మొదటి రాత్రి ఏం నూరిపోసిందో మహాతల్లి' అంటూ నీ కోడల్ని ఆడిపోసుకున్నారు. ఆవేశంలో. నిజానికి అప్పుడెప్పుడో నాన్నగారి విషయంలో ఆపని చేసింది నువ్వుగానీ, నీ కోడలు కాదు.

స్వార్థంతో ఎవరి బ్రతుకులు వాళ్ళు బ్రతుకుదాం అనుకుంటే వయసు మళ్ళాక తెలుస్తుంది అందులోని నరకమేంటో! ఆనాడు మీరు, ఇప్పుడు మేము, ఆ తర్వాత మా పిల్లలూ.. వాళ్ళ పిల్లలూ ఇలా పెద్దవాళ్ళను లక్ష్యపెట్టకుండా పోతుంటే మానవ జీవితానికి అర్థం, పరమార్థం లేకుండా పోతుంది. ఇది చదివాకైనా మీరు మారతారనే విశ్వాసంతో..."

నిర్ఘాంతపోయారా దంపతులు. పశ్చాత్తాపంతో పరితపిస్తూ ఆ రాత్రంతా గతాన్ని గుర్చే చింతిస్తూ మరుసటి రోజు ఉదయాన్నే బయల్దేరి వెళ్ళి కన్నవాళ్ళ కాళ్లమీద పడ్డాడు దశరథరామయ్య. సీతారత్నం దుఃఖిత మనస్కురాలై క్షమించాల్సిందిగా దీనంగా అభ్యర్థించింది అత్తమామల్ని.

ముసలివాళ్ళిద్దరూ కానికాలంలో తనవాళ్ళంతా దగ్గరవ్వడంతో హాయిగా తృప్తిగా ఊపిరిపీల్చుకున్నారు. తన కర్తవ్యం నెరవేర్చినందులకు మంజునాథ్ ఆ భగవంతునికి మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకుంటూ...

"మీలో మార్పుకోరే మిమ్మల్ని కష్టపెట్టినట్లుగా నటించాల్సి వచ్చిందంటూ" మంజునాథ్ క్షమాపణలు చెప్పుకుంటూంటే అతని పక్కకే వచ్చి చేరింది సుగుణ చేతులు జోడిస్తూ....! ✻

## ముద్దుల సుందరి

షమితా శెట్టి సినిమా ఇండస్ట్రీలోకి వచ్చి చాలా కాలం అయినా తనకంటూ ఓ ఇమేజ్ ఏర్పరుచుకోవడంలో విఫలమైంది. ప్రస్తుతం ఆమె ముద్దుల సీన్స్‌తో సినిమాలు హిట్ అవతాయన్న ఆశతో అలాంటి దృశ్యాలను వెనుకాడకుండా చేస్తోంది. ఇంతకుముందు మనోజ్ బాజ్‌పాయికి ముద్దు ఇస్తే ఇప్పుడు మనోజ్ శెట్టికి ముద్దులు అందిస్తోంది. అయితే సినిమాలు హిట్ అయ్యేది యాక్టింగ్ వల్ల కానీ, ముద్దు సీన్స్ వల్ల కాదు అని షమితా శెట్టి ఎప్పటికి తెలుసుకుంటుందో పాపం!

## ఇలా అయితే ఎలా?

దర్శకుడు కృష్ణవంశీని పెళ్ళి చేసుకున్న రమ్యకృష్ణ ఇంతకుముందులాగే ఐటమ్‌సాంగ్స్‌లో వల్గర్‌గా చెయ్యడం ప్రేక్షకులు జీర్ణించుకోలేక పోతున్నారు. 'సింహాద్రి' చిత్రంలో ఆమె చేసిన పాట చాలా అసభ్యంగా ఉందని, ఇలాంటి పాటల్లో నటించడం వల్ల కృష్ణవంశీకి ఉన్న ఇమేజ్ దెబ్బ తింటుందని ప్రేక్షకులు అంటున్నారు. ఏది ఏమైనా ఇకపై రమ్యకృష్ణను ప్రేక్షకులు గృహిణిగా తప్ప నటిగా చూడలేమన్న నిర్ణయానికి వచ్చేశారు.

